ఈనాడు పల్నాడు
గురువారం అక్టోబరు 10, 2024


అమరావతి: సరస్వతీదేవి అలంకరణలో బాలచాముండికా అమ్మవారు


పిడుగురాళ్లలో కన్యకాపరమేశ్వరి అలంకరణ


సత్తెనపల్లిలోని శ్రీశక్తి దుర్గారూపంలో..

వాగ్దేవి.. విజ్ఞానప్రదాయిని

దసరా ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. భక్తులతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. నవరాత్రుల్లో అమ్మవారు రోజుకో రూపంలో దర్శనమిస్తోంది. మూలా నక్షత్రం పురస్కరించుకుని బుధవారం సరస్వతీమాతగా అలంకరించారు. చిన్నారులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. ఆలయాల వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

- న్యూస్‌టుడే, అమరావతి, పిడుగురాళ్ల, వినుకొండ, సత్తెనపల్లి


పిడుగురాళ్లలో కుంకుమపూజలో మహిళలు


వినుకొండ: సరస్వతీమాత పూజలో చిన్నారులు

ఓటర్ల జాబితా వెల్లడి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికల్లో భాగంగా ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారి వెల్లడించారు. జీజీహెచ్‌తో పాటు, డీఎంహెచ్‌వో కార్యాలయాల్లో వీటిని అందుబాటులో ఉంచారు. ఈనెల 14న ఎన్నికల ప్రకటన విడుదల చేస్తారు. 16న నామినేషన్ల స్వీకరణ, 17న పరిశీలన అనంతరం తుది జాబితాను ప్రకటిస్తారు. 18న ఉపసంహరణకు సాయంత్రం 5 గంటల వరకు గడువు ఇచ్చారు. అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు ప్రకటిస్తారు. ఎన్నికలు అవసరమైతే 23న జీజీహెచ్‌లో నిర్వహించి అదే రోజు ఫలితాలను వెల్లడిస్తారు.

విపత్తులొచ్చినా.. విత్తు చల్లాలన్నా..
డ్రోనాస్త్రం..

ఈనాడు – అమరావతి

బుడమేరు వరదలో చిక్కుకున్న బాధితులకు ఆహారం, ఔషధాలు అందించడానికి...

వరదనీటి ప్రవాహం ఏ స్థాయిలో ఉందో గమనించడానికి..... పొలాల్లో విత్తనాలు, పంటలకు రసాయనాలు చల్లడానికి..పీహెచ్‌సీల నుంచి
లంక గ్రామాలకు మందుల సరఫరాకు...

ఇలా ప్రతీ పనీ సులభంగా, వేగంగా పూర్తి కావడానికి డ్రోన్ల వినియోగం బాగా పెరిగింది. వీటి ప్రాధాన్యాన్ని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి.

సంక్లిష్ట పరిస్థితుల్లో.....

వరదలొచ్చినప్పుడు కృష్ణా నది లంక గ్రామాలకు బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోతుంటాయి. రాకపోకలుండవు. ఈ పరిస్థితుల్లో బాధితులకు అవసరమైన ఆహారం, మందులు అందించడానికి డ్రోన్లు బాగా ఉపయోగపడుతున్నాయి. పది కిలోల బరువును మోసుకెళ్తున్నాయి. అనుకున్న ప్రదేశానికి సులువుగా వెళ్లగలుగుతున్నాయి. బుడమేర వరద సమయంలో డ్రోన్లను ప్రభుత్వం బాగా వినియోగించింది. తీవ్రత ఎక్కువ ఉన్న ప్రాంతాల చిత్రాలను తీయడంతోపాటు, గండ్ల పూడ్చివేత పనుల పరిశీలనకు అవి అక్కరకొచ్చాయి.


పొలాల్లో డ్రోన్‌తో పురుగుమందులు చల్లుతూ...


భూమి కొలతల్లో డ్రోన్ వినియోగం

భూముల సర్వేలోనూ...

భూముల సర్వే, కొలతలకు, గట్లు, ఇతర అంశాలను గుర్తించేందుకు చిత్రాలు తీయడానికి ఇప్పటికే రెవెన్యూ, భూమి కొలతల విభాగాల్లో డ్రోన్లను బాగా వినియోగిస్తున్నారు. భూమి కొలతలు నిర్దిష్టంగా గుర్తించడంలో వీటి పాత్ర చాలా కీలకంగా ఉంది. వాగులు, వంకలు, చెరువులు, నదీ పరివాహక ప్రాంతాల్లో వీటి ద్వారా సేకరించిన చిత్రాలు భూపరిపాలనా విభాగానికి ఉపయోగపడుతున్నాయి.

ఔషధాల తరలింపులోనూ వినియోగం

వైద్యరంగంలోనూ...

వైద్యరంగంలోనూ డ్రోన్ల వినియోగానికి అడుగులు పడుతున్నాయి. పైలట్ ప్రాజెక్టుగా కొల్లిపర మండలంలో చేపట్టిన ప్రయోగం ఫలవంతమైంది. మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి 15 కిలోమీటర్ల దూరంలోని అన్నవరపులంకలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి ఔషధాల కిట్‌ను విజయవంతంగా పంపించారు.

సాగులోనూ..: కూలీల కొరతను అధిగమించేందుకు, సంక్లిష్టమైన పనులు చేసేందుకు, పెట్టుబడి వ్యయాన్ని తగ్గించేందుకు డ్రోన్లు ఉపయోగపడుతున్నాయి. విత్తనాలు, పురుగుమందులు చల్లేందుకు వీటి వినియోగం బాగా పెరిగింది. తాజాగా చీడపీడల్ని గుర్తించేందుకు కూడా ప్రయోగాత్మకంగా ఉపయోగిస్తున్నారు. సాంకేతిక విద్య అభ్యసించిన యువతతోపాటు, రైతులు శిక్షణ తీసుకుంటున్నారు.

యువతకు శిక్షణ: గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డ్రోన్ పైలట్ల కోసం ప్రత్యేక కోర్సు నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో కొల్లిపర మండలం మున్నంగి ప్రైవేటు సంస్థ యువతకు శిక్షణ ఇస్తోంది. ఈ రెండుచోట్లా 874 మందికి ధ్రువపత్రాలిచ్చారు. వీరిలో కొందరు ప్రైవేటు కంపెనీల్లో పని చేస్తుండగా, మరికొందరు సొంతంగా డ్రోన్లు కొనుగోలు చేసి స్వయం ఉపాధి పొందుతూ ఇతరులకూ అవకాశాలిస్తున్నారు. పొలాల్లో పురుగుమందులు చల్లుతూ ఎకరాకు రూ. 300 నుంచి రూ. 500 వరకు తీసుకుంటున్నారు. ☛ కేంద్రం మహిళా స్వయం సహాయక బృందాలకు డ్రోన్లు ఇవ్వాలని నిర్ణయించింది. ☛ రాష్ట్ర ప్రభుత్వం కూడా డ్రోన్ కార్పొరేషన్ ద్వారా సేవలు విస్తృతం చేసేందుకు కసరత్తు చేస్తోంది.

శీతల గిడ్డంగులు పెంచేందుకు ప్రణాళికలు రూపొందించండి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : సహకార సంఘాల ఆధ్వర్యంలో శీతల గిడ్డంగులు పెంచేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు 15 నాటికి సహకార సంఘాల కంప్యూటీకరణ పూర్తి కావాలన్నారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పెట్రోలు బంకులు, జన ఔషధి విక్రయ కేంద్రాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. బొల్లాపల్లి, కారుమంచి సహకార సంఘాలకు మంజూరైన పెట్రోలు బంకులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాదెండ్ల సహకార సంఘం నిర్వహిస్తున్న ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రం గురించి తక్కువ ధరకు ఔషధాల లభ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించి విక్రయాలు పెంచాలని తెలిపారు. ఈపూరు, నరుకుళ్లపాడు, శావల్యాపురం, కారుమంచిలో మంజూరైన కేంద్రాలను త్వరలో ప్రారంభించాలని తెలిపారు. రానున్న ఐదేళ్ల కాలంలో సహకార సంఘాల ఆధ్వర్యంలో శీతల గిడ్డంగులను గణనీయంగా పెంచాలని తెలిపారు ఇప్పటికే నిర్వహిస్తున్న బహుళ ప్రయోజన గిడ్డంగులను అద్దెకు ఇచ్చేటపుడు ప్రభుత్వ రంగసంస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లా సహకార అధికారి వెంకటరమణ, జీడీసీసీ బ్యాంకు జీఎం అజయ్‌కిశోర్, నాబార్డు అధికారి శరత్, జిల్లా మత్స్య అధికారి సంజీవరావు, పశు సంవర్ధకశాఖ అధికారి కాంతారావు పాల్గొన్నారు.


సమీక్షలో కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు

వెబ్‌సైట్‌లో మద్యం దరఖాస్తుల వివరాలు

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే : జిల్లాలోని 129 మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు 1618 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో ఏ దుకాణానికి ఎన్నొచ్చాయన్న సమాచారాన్ని వెబ్‌సైట్‌లో ఉంచామని అబ్కారీ శాఖ ఈఎస్ మణికంఠ తెలిపారు. నరసరావుపేట జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకునేందుకు గడువు 11 రాత్రి 7 వరకు ప్రభుత్వం పొడగించిందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు, దరఖాస్తుదారుల సమక్షంలో 14న లాటరీ తీసి దుకాణాలు కేటాయిస్తామన్నారు. *https://hpfsproject.com* వెబ్‌సైట్‌లో ఇల్లు, ఇంటర్ నెట్ కేంద్రాల నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.




ఉక్కపోత తట్టుకోలేని రోగులకు బంధువుల సపర్యలు

ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి

జీజీహెచ్‌లోని ఏఎంసీ అత్యవసర రోగుల అడ్వాన్స్‌డ్ ఐసీయూ విభాగాల్లో ఏసీలు, ఫ్యాన్‌లు పని చేయడం లేదు. ఓ పక్క ఉక్కపోత తట్టుకోలేకపోతుంటే.. మరోపక్క లోపల ఉన్నవారికి గాలి తగలక అల్లాడిపోతున్నారు. ఏఎంసీలో అయితే అసలేమీ పని చేయడం లేదు. అడ్వాన్స్‌డ్ ఐసీయూలో కొన్ని మూలనపడ్డాయి. గత రెండు నెలలుగా ఇదే పరిస్థితి. ఈ విభాగాల్లో కిటికీలన్నీ మూసేసే ఉంటాయి. శీతల యంత్రాలు కాసేపు పని చేయకపోతేనే ఉండలేము. అలాంటిది రోజుల తరబడి రోగులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వారి బంధువులే విసనకర్రలతో సపర్యలు చేయాల్సి వస్తోంది. జీజీహెచ్ అధికారులు వెంటనే స్పందించి ఏసీలు, ఫ్యాన్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

- ఈనాడు, గుంటూరు


ఏఎంసీలో పనిచేయని ఏసీలు

పల్నాడులో ప్రశాంతతే లక్ష్యం

ఈనాడు డిజిటల్, నరసరావుపేట



స్వచ్ఛందసంస్థల భాగస్వామ్యంతో అంతటా సీసీ కెమెరాలు

నేరాల కట్టడికి పటిష్ఠ చర్యలు

ఎస్పీ కంచి శ్రీనివాసరావు

పల్నాడు జిల్లాలో ప్రశాంతతే లక్ష్యంగా శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికలు, పోలింగ్, తదనంతర రోజుల్లో జరిగిన అల్లర్లతో జిల్లా వార్తల్లో నిలిచింది. అలాంటి పల్నాడుకు ఎస్పీగా వచ్చి వందరోజులు పూర్తయిన నేపథ్యంలో ఆయన 'ఈనాడు'తో ముఖాముఖి మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లో...

ఏ స్టేషన్ పరిధిలో ఎలాంటి నేరాలు

గస్తీని పూర్తిగా మార్చేశాం. కానిస్టేబుళ్లు మాత్రమే కాకుండా, సీఐ, ఎస్సైలు కూడా క్షేత్రస్థాయిలో తిరిగేలా చూస్తున్నాం. పాతనేరస్థుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నాం. వారందరినీ పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చాం. మ్యాపింగ్ సిస్టమ్‌ను పునరుద్ధరించాం. గొలుసు దొంగతనాలు, హత్యాయత్నాలు, దోపిడీలు లాంటివి ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతున్నాయి? అక్కడే ఎందుకు పునరావృతమవుతున్నాయి? అనే అంశాలపై దృష్టిపెట్టాం. ఏయే స్టేషన్ పరిధిలో ఎలాంటి నేరాలు తరచుగా చోటుచేసుకుంటున్నాయి? లాంటి వివరాలు తెప్పించుకున్నాం. అవీ మళ్లీ జరగకుండా ఉండేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం. మాచవరం మండలంలో పిన్నెల్లి గ్రామంలో ఫ్యాక్షన్ కక్షలు వంటివి ఇప్పటికీ అక్కడ నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. మాచవరం మండలంలో అధికసంఖ్యలో సిబ్బందిని కేటాయించి ప్రతిక్షణం ప్రత్యర్థుల కదలికలను గమనిస్తూ అల్లర్లు జరగకుండా చూసుకుంటున్నాం. ఇటీవల అక్కడ జరిగిన ఓ రెండు ఘటనల్లో కేసులు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశాం.

సీసీ కెమెరాలతో నిఘా

కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సీసీ కెమెరాలను జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాల్లో ఏర్పాటు చేయిస్తున్నాం. మాచర్లలో ఉన్న కేసీపీ సిమెంట్ యాజమాన్యం భాగస్వామ్యంతో రూ. 5.50 లక్షలతో మాచర్ల నియోజకవర్గంలోని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నాం. ఫ్యాక్షన్ కదలికలతో పాటు ఇతర నేరాలు అరికట్టడానికి ఇవి ఉపయోగపడనున్నాయి. మా క్రైం బ్రాంచ్‌లో సిబ్బంది పరిమితంగా ఉన్నా.. ప్రతిస్టేషన్‌లో మరికొందరినీ ఈ క్రైం బ్రాంచ్‌కు అటాచ్ చేసి నేరాలపై ప్రత్యేక దళాలుగా ఏర్పాటు చేశాం. వీరంతా ప్రతిరోజూ సమస్యాత్మక ప్రాంతాల్లో మఫ్టీలో నేరాలు జరగకుండా పర్యవేక్షిస్తారు.

పోలీసు పల్లెనిద్ర..

నరసరావుపేట, సత్తెనపల్లి, వినుకొండ వంటి ముఖ్యమైన పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య ఉంటోంది. సిబ్బంది సరిపోవడం లేదు. ఎస్పీ కార్యాలయంలో ఉండే ఏఆర్ కానిస్టేబుళ్లను ట్రాఫిక్ కూడళ్ల వద్ద విధులు నిర్వర్తించేలా చూస్తున్నాం. వీరంతా మఫ్టీలో ట్రాఫిక్ కూడళ్ల వద్ద గస్తీ కాస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల మధ్య సిబ్బంది ఠాణాల్లో కూర్చోకుండా బయట ఉండేలా ప్రణాళికలు రూపొందించాం. సీఐ, ఎస్సైలు ఎవరో ఒకరు ఆ సమయంలో నేరాలు జరిగే ప్రాంతాల్లో గస్తీ ఉండేలా చూస్తున్నాం. ఒక ఠాణా పరిధిలో ఉండే గ్రామాల్లో వారానికోసారి 'పోలీసు పల్లెనిద్ర' నిర్వహించేలా చూస్తున్నాం. సీఐ తప్పనిసరిగా ఒక గ్రామంలో రాత్రి బస చేయడమే కాకుండా అక్కడ ఉండే పరిస్థితులపై అవగాహన ఏర్పరచుకోవాలి. ఆ గ్రామస్థుల్లో ముఠా తగాదాలు లేకుండా చూడడమే ఈ పల్లెనిద్ర లక్ష్యం.

సిరిమానోత్సవానికి బందోబస్తు

మాచర్ల మండలం జమ్మలమడకలో ఈనెల 10న సిరిమానోత్సవం పెద్దఎత్తున జరుగుతుంది. ఇక్కడ ఓ మూడు వర్గాలు ఆ సిరిమాను కోసం పోటీపడి గొడవలు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం అందింది. గతంలో 2012లో జరిగింది. పోలీసులపై కూడా అప్పట్లో దాడులు జరిగాయి. ఈసారి భారీ సంఖ్యలో పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నాం.

జడ్పీ ఆస్తుల పరిరక్షణకు చర్యలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2,500 ఎకరాల వరకు జడ్పీ భూములు ఉన్నాయని, అవి అన్యాక్రాంతం కాకుండా పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో కలిసి స్థానిక జడ్పీ స్థలంలో నిర్మించిన పంచాయతీరాజ్‌శాఖ భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీ స్థల దాత కట్టమూరి నరసింహం జిల్లా పరిషత్ ప్రాంగణంగా నామకరణం చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గతంలో ఓ ఎమ్మెల్యే సత్తెనపల్లిలో ఉన్న జడ్పీ స్థలాన్ని ఆక్రమించాలని చేసిన ప్రయత్నాన్ని తాను గట్టిగా ఎదుర్కొన్నానని పరోక్షంగా మాజీమంత్రి అంబటి రాంబాబు తీరుపై జడ్పీ ఛైర్‌పర్సన్ విమర్శలు చేశారు. జడ్పీ భూములు, స్థలాల పరిరక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఎమ్మెల్యే కన్నా సహకారంతో జడ్పీ స్థలాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. డీఈ శేఖర్‌బాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రామస్వామి, తెదేపా నాయకులు రామచంద్రరావు, నాగేశ్వరరావు, వెంకటకోటయ్య తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ఉద్యోగాల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: జాతీయ ఆరోగ్య మిషన్ గుంటూరు విభాగంలో ఉద్యోగాల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి విజయలక్ష్మి తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, శానిటరీ అటెండర్ల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 16 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులను డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాల్సిందిగా పేర్కొన్నారు. వివరాలు **www.guntur.ap.gov.in** వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

తాళ్లచెరువు(అచ్చంపేట), న్యూస్‌టుడే: అప్పుల బాధ తాళలేక ఓ రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం అచ్చంపేట మండలం తాళ్లచెరువులో చోటుచేసుకుంది. పోలీసులు, రైతు బంధువుల వివరాల ప్రకారం.. తాళ్లచెరువు గ్రామానికి చెందిన రైతు తుమ్మా చిన్నపరెడ్డి (51) మూడేళ్లుగా మిరప పైరు సాగు చేస్తూ నష్టాలను చవిచూశారు. రూ. 30 లక్షల వరకు అప్పులు చేశారు. ఈ ఏడాది నాలుగున్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా.. ఇటీవల వర్షాలకు దెబ్బతింది. సొంత భూమి 1.40 ఎకరాలు అమ్మి అప్పులు తీరుద్దామన్నా రూ. 15 లక్షలకు మించి కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు. దీంతో అప్పులు ఎలా చెల్లించాలో పాలుపోక బుధవారం మధ్యాహ్నం మొక్కజొన్న పొలంలోనే పురుగు మందు తాగి బలవన్మరణం పొందారు. ఆయనకు భార్య జోత్స్న, ఇద్దరు మగ సంతానం ఉన్నారు. వీఆర్వో బాలునాయక్, సీఐ వెంకటప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు.


చిన్నపరెడ్డి (పాత చిత్రం)

రోడ్డుపై పచ్చతోరణం



నరసరావుపేట నుంచి నకరికల్లు అడ్డరోడ్డు వెళ్లే ప్రధాన మార్గం దేచవరం సమీపంలో ఓ మర్రి చెట్టు తోరణంలా పెరుగుతోంది. నిటారుగా పెరగాల్సిన చెట్టు.. రోడ్డు ఇవతలి వైపు నుంచి అవతలి వైపునకు వంపుగా పెరుగుతోంది. ఈ దారిలో రాకపోకలు సాగించే వారు కాసేపు ఆగి చెట్టు వద్ద సెల్ఫీలు దిగుతున్నారు. బస్సులు, లారీలు వంటి భారీ వాహనాలకు ఆటంకం లేకుండా ఎత్తులో పెరుగుతున్న ఈ మర్రిచెట్టును వాహనదారులు ఆసక్తిగా చూస్తూ వెళుతున్నారు.

-ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, నకరికల్లు

గుంతలదారి.. ప్రమాదకరంగా మారి


దారంతా గోతులే..


తారులేచిపోయి ఇలా..


తంగెడ వద్ద రహదారి మధ్యలో ..

దాచేపల్లి మండలకేంద్రం నుంచి తెలంగాణ సూర్యాపేట జిల్లా వైపు వెళ్లే ప్రధాన రహదారి గుంతలతో దారుణంగా ఉంది. ఈమార్గంలోని సిమెంట్ పరిశ్రమల నుంచి అధిక లోడ్‌లతో వచ్చే భారీ వాహనాల వల్ల 18 కిలోమీటర్ల మేర దారి కనిపించనంతగా గుల్లయిపోయి వాహనదారులకు నరకం కనిపిస్తోంది. గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో కనీస మరమ్మతులు చేయక పోవడంతో ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. – ఈనాడు నరసరావుపేట. న్యూస్‌టుడే దాచేపల్లి.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేశాం


దరఖాస్తులను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, నేతలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఐదేళ్లలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రైతులు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేశామని కేఎస్ లక్ష్మణరావు అన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారుల పట్ల నిర్దయగా వ్యవహరించింది.. వారి పక్షాన ఉద్యమాలు నడిపామని గుర్తు చేశారు. 2025 మార్చిలో ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నట్లు చెప్పారు. 2021 నవంబరు నాటికి డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు అందరూ ఓటరుగా నమోదు కావాల్సి ఉందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, గృహిణులు, ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. యూటీఎఫ్ కార్యాలయంలో ఓటు నమోదు కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా దరఖాస్తులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్, యూటీఎఫ్ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల దరఖాస్తు గడువు పొడిగింపు


మాట్లాడుతున్న జిల్లా అబ్కారీ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీంద్ర, సీఐ తులసి

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: జిల్లాలో మద్యం దుకాణాల దరఖాస్తు గడువు రెండు రోజులు పొడిగించామని, ఈనెల 11వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా అబ్కారీ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీంద్ర తెలిపారు. బుధవారం ఆయన క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్‌లో టెండర్ల ప్రక్రియ పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు 20 దుకాణాలకు గాను 200 దరఖాస్తులు అందాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు దాఖలుకు కొంత మందకొడిగా ఉన్నట్లు తెలిపారు. పెదకూరపాడు సర్కిల్‌లో 10, క్రోసూరు సర్కిల్‌లో 10 దుకాణాలు ఉన్నాయన్నారు.

విద్యుత్తు చౌర్యం.. రూ.13.80 లక్షల అపరాధ రుసుం

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: విద్యుత్తు చౌర్యానికి పాల్పడే వారితో పాటు అదనపు లోడ్ వినియోగిస్తున్న వారిని గుర్తించేందుకు ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు కేవీ ఎల్ఎన్ మూర్తి తెలిపారు. ఇందులో భాగంగా ఒకేసారి 58 బృందాలను ఏర్పాటు చేసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. గుంటూరులోని డి-8 సెక్షన్ పరిధిలో బుధవారం నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 277 మందికి నోటీసులు జారీ చేసి రూ.13.80 లక్షల జరిమానా వసూలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో అనుమతించిన లోడ్ కన్నా ఎక్కువగా విద్యుత్తును వినియోగిస్తున్నవారే అధికంగా ఉన్నారన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు వెంకటేశ్వరరావు, ఈఈ శ్రీనివాసబాబు, డిప్యూటీ ఈఈలు ఎం.రవికుమార్, గురవయ్య తదితరులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల జాతర

పల్లెల్లో ప్రగతి పండగకు సిద్ధం
గుర్తించిన పనుల పూర్తికి నిధులు


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (పాతచిత్రం)

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే

పల్లెలను గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. పంచాయతీ నిధులు పక్కదారి పట్టించింది. ఆర్థిక సంఘం నిధులను ఇతర పథకాలకు మళ్లించింది. ఫలితంగా గ్రామాల్లో కనీస వసతులు కరవయ్యాయి. పారిశుద్ధ్య పనులు చేయలేని పరిస్థితి. సర్పంచులు సొంత నిధులు ఖర్చు చేయగా వాటి బిల్లులు రాక అప్పుల పాలయ్యారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామాలకు మంచిరోజులు వచ్చాయి. పల్లెవాసుల కష్టాలు తీరనున్నాయి. ఉపాధి హామీ నిధులతో రోడ్లు, మురుగు కాలువలు, రహదారులు ఇతర సౌకర్యాలు సమకూరేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల పరిధిలో 510 పనులకు రూ.5899.5 లక్షలు వెచ్చించనున్నారు. వినుకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 117 పనులకు రూ.1000 లక్షలు కేటాయించినట్లు సమాచారం.

నియోజకవర్గం	పనులు	నిధులు (రూ.లక్షల్లో)
వినుకొండ	117	1000
మాచర్ల	100	1000
గురజాల	85	800
నరసరావుపేట	59	600
చిలకలూరిపేట	63	700
సత్తెనపల్లి	78	799.50
పెదకూరపాడు	8	1000

గ్రామసభల్లో గుర్తించి..

జిల్లాలో సమస్యలు తెలుసుకునేందుకు ఆగస్టులో గ్రామసభలు నిర్వహించారు. వీటికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ఆయా ప్రాంతాల్లో సమస్యలను పాలకులు, అధికారులు గుర్తించారు. అందుకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా ఈనెల 14 నుంచి 21 వరకు పల్లె పండగ నిర్వహించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి గ్రామంలో రోడ్లు, కాలువలు, ఇతర వసతులు కల్పించే పనులకు శంకుస్థాపనలు చేయాలని నిర్ణయించింది. వచ్చే సంక్రాంతి నాటికి రహదారుల పనులు పూర్తిచేసి మరో పండగ నిర్వహించేలా ప్రభుత్వం లక్ష్యాలు విధించింది.

రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం ట్రాలీ ఆటో

రొంపిచర్ల: అక్రమంగా తరలిస్తున్న 101 బస్తాల రేషన్ బియ్యాన్ని బుధవారం రొంపిచర్ల పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని మాచవరం ఎస్సీ కాలనీ వద్ద రేషన్ బియ్యాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం రావడంతో దాడి చేసి బియ్యం, వాహనాన్ని పట్టుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాలీ ఆటో డ్రైవర్ తన్నీరు వెంకట రామాంజనేయులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఎస్సై శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.

నేటి నుంచి అండర్-14 బాలుర అంతర్ జిల్లా క్రికెట్ పోటీలు

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రూప్-బి అండర్-14 బాలుర అంతర జిల్లా క్రికెట్ పోటీలు ఏపీఏ ఎస్ఆర్‌కేబీ క్రికెట్ మైదానంలో గురువారం నుంచి ప్రారంభమవుతాయని మైదానం అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతి రావు బుధవారం తెలిపారు. పోటీల్లో శ్రీకాకుళం, అనంతపురం, నెల్లూరు, విజయనగరం, కృష్ణా, గుంటూరు జిల్లాల జట్లు పాల్గొంటాయని ఆయన చెప్పారు.

తెదేపా నాయకుడిపై కేసు కొట్టివేత

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : క్రోసూరు మండలానికి చెందిన తెదేపా నాయకుడు కంచేటి సాయిబాబుపై గత వైకాపా ప్రభుత్వంలో పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టివేస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు. తెలంగాణ నుంచి మద్యం కొనుగోలు చేసి తీసుకొచ్చి విక్రయిస్తున్నారని గత సార్వత్రిక ఎన్నికల ముందు కంచేటి సాయిబాబుపై క్రోసూరు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో విభేదాలతో వైకాపా ప్రభుత్వం అక్రమ కేసు నమోదు చేసిందని రాజకీయ విమర్శలొచ్చాయి. సాయిబాబుపై మోపబడిన అభియోగాలు రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేస్తూ ఒకటో అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ప్రియదర్శిని బుధవారం తీర్పు ఇచ్చారు.

అనధికార బయో ఉత్పత్తిదారులపై కేసులు

వినుకొండ, న్యూస్‌టుడే : అనధికార బయో ఉత్పత్తిదారులపై 'ఈనాడు'లో ప్రచురితమైన వరుస కథనాలపై వ్యవసాయ శాఖ స్పందించి కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు నకిలీలపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులను కోరగా ఇన్‌ఛార్జి ఏడీఏ రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని వెన్నపూసకాలనీలో అనుమతి లేకుండా బయో మందులు తయారు చేస్తున్న రెండు గోదాంల నిర్వాహకులు వై.సూర్యనారాయణ, భూక్యా బాలునాయక్‌పై ఏవో అంజిరెడ్డి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో శోభన్‌బాబు తెలిపారు.

విజ్ఞానదాయకంగా అంతరిక్ష వారోత్సవాలు


ఆనందోత్సాహాల్లో ఇస్రో శాస్త్రవేత్తలు, నిర్వాహకులు, విద్యార్థులు


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న అతిథులు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: ఇస్రో ఆధ్వర్యంలో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో మూడ్రోజుల పాటు నిర్వహించిన అంతరిక్ష వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. చివరి రోజు బుధవారం హైఎనర్జీ మెటీరియల్స్, సౌండ్ ప్రొపల్షన్స్ అనే అంశంపై అధ్యాపకులు, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. షార్ చీఫ్ జనరల్ మేనేజర్ రమణారెడ్డి షార్‌లో చేసే పరిశోధనలు, ఉపగ్రహాల్లో నింపే ఇంధనాల మోతాదు తదితర అంశాలు వివరించారు. పాఠశాలల విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం తదితర అంశాలపై పోటీలు నిర్వహించి.. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ నేతలు మిట్టపల్లి కోటేశ్వరరావు, ఎం.చక్రవర్తి, ఎం.రమేష్, ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

చిట్టి చిట్టి కమలాలు పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయంలో బుధవారం చిట్టి చిట్టి కమలాలు పుస్తకాన్ని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు ఆవిష్కరించారు. శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో నెలనెలా సాహిత్యమేళా కార్యక్రమాలకు కొనసాగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. కర్నూలు జిల్లా కంబద హాళ్ జడ్పీ ఉన్నత పాఠశాల గణితోపాధ్యాయుడు, బాల సాహితీవేత్త గద్వాల సోమన్న రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజాన్ని మంచి వైపు నడిపేది సాహిత్యమేనని వక్తలు పేర్కొన్నారు. బాలల సాహిత్యం వైపు పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి, డాక్టర్ కాకాని సుధాకర్, పరిషత్ అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రేణుకయుద్ధం


వేడుకలో గ్రామస్థులు

వెల్దుర్తి (మాచర్ల), న్యూస్‌టుడే: మాచర్ల మండలం జమ్మలమడక గ్రామంలో ముత్యాలమ్మ తల్లి కొలుపులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. జాతరలో భాగంగా అయిదో రోజు బుధవారం గ్రామానికి చెందిన యాదవ సామాజిక వర్గీయులు పటాన్, రాజులుగా విడిపోయి రేణుక యుద్ధం చేశారు. రాజులు నిప్పు పట్టుకొని ఆరిపోకుండా పెద్దమంటలు వచ్చేలా గుగ్గిలం వేస్తూ గుడి చుట్టూ పరుగులు తీయగా.. పటాన్‌లు వేప మండలతో నిప్పు ఆర్పడానికి ప్రయత్నించారు. ఈ కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకుంది. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు. గురువారం సిరిమాను ఉత్సవం నిర్వహిస్తారు.

నిషేధిత లాటరీ టిక్కెట్ల విక్రేతల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హనుమంతరావు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: నిషేధిత లాటరీ టిక్కెట్లను విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్టుచేసి బుధవారం కోర్టులో హాజరుపర్చినట్లు డీఎస్పీ హనుమంతరావు చెప్పారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. నిషేధిత లాటరీ టిక్కెట్లను పట్టణంలో విక్రయించడంపై 2022లో కేసు నమోదైందన్నారు. స్థానిక ఆరోవార్డు గుంటూరు మేస్త్రి బజారుకు చెందిన గంటా నారాయణరెడ్డి మరికొందరితో కలిసి నిషేధిత తంగం, నల్లనేరం పేర్లు ఉన్న లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్నాడన్నారు. పట్టణంలోని తారకరామసాగర్ ఎదురుగా ఉన్న జాషువా విగ్రహంవద్ద నారాయణరెడ్డితోపాటు పట్టణానికే చెందిన షేక్ కరిముల్లా, షేక్ సిలార్, మరడ శ్రీనివాసరావు, ఒంటిపులి శ్రీనులను అరెస్టు చేశామన్నారు.

నకరికల్లు: నిషేధిత లాటరీ టికెట్లు అమ్ముతున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. నకరికల్లుకు చెందిన మామిడిశెట్టి సుబ్బారావు కొంతమంది గుమస్తాలను నియమించుకుని, వారి ద్వారా లాటరీ టికెట్లను విక్రయిస్తున్నాడు. ఈ విషయం గుర్తించి నిందితులను అరెస్టు చేశారు.

ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

పిడుగురాళ్ల : తెలుగు రాష్ట్రాల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలను చోరీ చేసే ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ఎస్.వెంకట్రావు చెప్పారు. బుధవారం పట్టణ పోలీసుస్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన కొండపల్లి ఆంజనేయులు, వేముల హనుమంతు, కారంపూడి మండలానికి చెందిన వెల్లూరి ఆంజనేయులు కలిసి రాత్రిపూట వాహనాలను చోరీ చేస్తుంటారని చెప్పారు. పిడుగురాళ్లలో ఆటో, ద్విచక్ర వాహనం, హైదరాబాద్‌లో రెండు ద్విచక్ర వాహనాలు, నార్కట్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ఆటో, ద్విచక్ర వాహనాలను చోరీ చేశారు. నిందితులు ముగ్గురిని బుధవారం అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు చెప్పారు. ఎస్సై శివనాగరాజు పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణాల తనిఖీ


తనిఖీలు చేస్తున్న ఏవో, అధికారులు

ఈపూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఇనుమెళ్లలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి రామినేని రామారావు బుధవారం తనిఖీ చేశారు. అయిదు దుకాణాలను తనిఖీ చేయగా రెండింటిలో కొన్ని మందులకు ప్రిన్సిపల్ ధ్రువపత్రాలు లేకపోవడాన్ని గుర్తించారు. దీంతో రూ.60,471 విలువైన పురుగుమందుల అమ్మకాలు నిలిపివేశారు. రామకృష్ణ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్‌లో రూ.53521, మణికంఠ ఫర్టిలైజర్స్‌లో రూ.6,950 మందుల అమ్మకాలను ఆపారు. అమ్మకాలను నిలిపివేసిన మందులకు 21 రోజుల్లో ధ్రువపత్రాలు తెచ్చుకుంటే అమ్మకాలు పునరుద్ధరిస్తామని ఆయన తెలిపారు. బయో ఉత్పాదకాలు విక్రయించాలంటే వాటికి జీ 2, జీ 3, ఎరువులకు ఓ ఫామ్స్, పురుగు మందులకు ప్రిన్సిపల్ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. అనుమతి లేని మందులు రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విజయవాడ-శ్రీకాకుళం రోడ్ ప్రత్యేక రైలు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే : దసరా రద్దీ దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ- శ్రీకాకుళం రోడ్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. నంబరు 07215 ప్రత్యేక రైలు ఈ నెల 10, 11, 12, 14, 15, 16, 17 తేదీల్లో విజయవాడలో రాత్రి 8కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.30కి శ్రీకాకుళం రోడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు నంబరు 07216 ఈ నెల 10, 11, 12, 13, 15, 16, 17, 18 తేదీల్లో శ్రీకాకుళం రోడ్‌లో ఉదయం 6.30కి బయలుదేరి సాయంత్రం 4 గంటలకు విజయవాడ చేరుతుంది. ఈ బండి ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్లలో ఆగుతుంది.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 138, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

శీతాకాలం మామిడి



నరసరావుపేట నుంచి నకరికల్లు ప్రధాన రహదారిలో అడ్డరోడ్డు వద్ద కొందరు మామిడి పండ్లను అమ్ముతున్నారు. వేసవిలో విరివిగా లభ్యమయ్యే మామిడి శీతాకాలంలోనూ దొరుకుతోంది. అయితే హైబ్రిడ్ రకం కావడం గమనార్హం. ఇది అన్ని సీజన్‌లలో కాపు కాస్తుందని విక్రయదారులు చెబుతున్నారు. కిలో రూ.350 నుంచి రూ.400 వరకూ ధర పలుకుతోంది.
ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, నకరికల్లు

రాగిపాత్రకు మహిమలున్నాయంటూ మోసాలు

ఈనాడు, హైదరాబాద్ : తమ వద్ద ఉన్న పురాతన రాగిపాత్రకు అద్భుత మహిమలున్నాయంటూ మోసాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.25 లక్షలు, రాగిపాత్ర, 7 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం డీసీపీ వై.వి.ఎస్.సుధీంద్ర వివరాలు తెలిపారు. సికింద్రాబాద్‌కు చెందిన శివసంతోష్, చిత్తూరు జిల్లా కుప్పానికి చెందిన జి.మంజునాథ్ రెడ్డి, బెంగళూరుకు చెందిన ప్రతాప్ ముఠాగా ఏర్పడి రైస్‌పుల్లింగ్ పేరిట మోసాలకు పాల్పడుతున్నారు. సికింద్రాబాద్‌కు చెందిన శశికాంత్‌కు మిత్రుడి ద్వారా మంజునాథ్‌రెడ్డి పరిచయమయ్యాడు. తాను రైస్‌పుల్లింగ్ యంత్రంతో రూ.10కోట్లు లాభపడినట్టు మంజునాథ్‌రెడ్డి అతడికి వివరించాడు. అది సొంతమయ్యేలా సహకరిస్తానంటూ భరోసానిచ్చాడు. కొద్దిరోజుల తరువాత శశికాంత్‌కు ఎస్‌డీరోడ్‌లోని ఓ హోటల్‌లో శివసంతోష్‌ను పరిచయం చేశాడు. తన వద్ద ఉన్న రాగిపాత్ర శక్తిని తెలుసుకునేందుకు డీఆర్‌డీవో రూపొందించిన స్కానర్ ద్వారా పరీక్షించుకోవచ్చని సలహా ఇచ్చాడు. డీఆర్‌డీవో శాస్త్రవేత్తగా ప్రతాప్‌ను రంగంలోకి దింపి పరిచయం చేశారు. స్కానర్‌పై పరీక్షించేందుకు అడ్వాన్స్‌గా 6న రూ.25లక్షలు తీసుకున్నారు. శశికాంత్ రాగిపాత్ర గురించి అడిగితే మరో రూ.25 లక్షలు కావాలంటూ మెలికపెట్టారు. అనుమానం వచ్చిన బాధితుడు మహంకాళి పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టి ముగ్గురిని అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి రూ.2కోట్లు, కరీంనగర్ నివాసి రూ.40 లక్షలు, నిజామాబాద్‌లో ఉంటున్న ఒకరు రూ.10లక్షలు ఈ ముఠా చేతిలో మోసపోయినట్టు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. విజయవాడ, గుంటూరు, చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో బాధితులున్నట్టు అంచనా వేస్తున్నారు.

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

రెవెన్యూ దస్త్రాల నిర్వహణ భేష్

నాదెండ్ల, న్యూస్‌టుడే : రెవెన్యూ దస్త్రాలతో పాటు కార్యాలయ నిర్వహణ భేషుగ్గా ఉందని ఆర్డీవో మధులత అన్నారు. నాదెండ్ల తహసీల్దారు కార్యాలయాన్ని బుధవారం ఆర్డీవో సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిష్కారం లభించని భూ సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది మెరుగైన పనితీరు కనబరచాలని చెప్పారు. దస్త్రాలు, కార్యాలయాన్ని పరిశీలించారు. తహసీల్దారు ఆలపాటి వెంకటరమణ, ఉప తహసీల్దారు ధనలక్ష్మి, వీఆర్వోలున్నారు. అనంతరం మండలానికి బదిలీపై వచ్చిన వీఆర్వోలతో తహసీల్దారు సమీక్ష నిర్వహించి, వారికి పలు సూచనలు చేశారు. పనులు సకాలంలో చేయాలని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156

యడ్లపాడు : 8008146652 వినుకొండ గ్రామీణ : 9440009293

? వంకాయలపాడులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్న మార్గం అధ్వానంగా ఉంది. కొత్త రోడ్డు నిర్మించి ఇబ్బందులు తొలగించాలి. **- స్థానికులు**

✔ గురుకుల పాఠశాల వరకు కొత్త సీసీ రోడ్డు నిర్మించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేస్తాం. **- హేమలతాదేవి, ఎంపీడీవో, యడ్లపాడు**

? లింగారావుపాలెంలో రక్షితనీటి పథకం నీరు ఇక్కడ సరిపడా రావటం లేదు. **- గ్రామస్థులు**

✔ అన్ని ఇళ్లకు సరిపడా అందేలా చర్యలు తీసుకుంటాం. **- శివయ్య, పంచాయతీ కార్యదర్శి, లింగారావుపాలెం**

నేడు ప్రత్యేక ఆధార్ శిబిరాలు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట): తపాలా వారోత్సవాల్లో భాగంగా నరసరావుపేట తపాలా శాఖ డివిజన్ పరిధిలోని మాచర్ల, కొలగట్ల, పెదపాలెం, ఒప్పిచర్ల తపాలా కార్యాలయాల్లో గురువారం ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తపాలా శాఖ డివిజనల్ సూపరింటెండెంట్ పి. వెంకటస్వామి పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న ఆధార్ కార్డుల్లో మార్పులు, పాన్ నంబరు లింక్, నూతన ఆధార్ కార్డు ఉచితంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



కావ్య

శావల్యాపురం, న్యూస్‌టుడే : జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు శావల్యాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని కామినేని కావ్య అర్హత సాధించినట్లు వ్యాయామోపాధ్యాయుడు రాగుల రాధాకృష్ణ మూర్తి తెలిపారు. 5 నుంచి 7 వరకు విశాఖపట్నం జిల్లాలో నిర్వహించిన అండర్-19 జూనియర్ బాలికల బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు నాలుగో స్థానం సాధించింది, పోటీల్లో కావ్య అత్యుత్తమ ప్రతిభ చూపగా రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారని పేర్కొన్నారు. త్వరలో మహారాష్ట్రలోని నాగపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆడనున్నట్లు చెప్పారు. కావ్య స్టార్ ఆఫ్ ఆంధ్ర బెస్ట్ ప్లేయర్ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. విద్యార్థినిని ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద ప్రభాకర్, ఈ. శివశంకర్, కార్యవర్గ సభ్యుడు వై. శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయిని బొడ్డపాటి విజయలక్ష్మి, సీనియర్ ఉపాధ్యాయుడు బి.వి. నాగేశ్వరరావు, కె. శ్రీనివాసరావు, పీఎంసీ ఛైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్ అభినందించినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రజల నమ్మకం నిలబెడతాం



మహిళకు చీర అందజేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా చేసుకునే పండగ విజయదశమి అని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. విఠంరాజుపల్లి సమీపంలోని ఆయన అతిథి గృహం వద్ద బుధవారం సుగాలీ ఆడపడుచులకు శివశక్తి ఫౌండేషన్ తరఫున దసరా కానుకగా చీరలు పంపిణీ చేశారు. రాష్ట్రానికి మంచి జరగాలని ప్రజలు చంద్రబాబు ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని, వారి నమ్మకాన్ని నిలబెడతామని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నేతలు నిశ్శంకరరావు శ్రీనివాసరావు, నాగశ్రీను, భాజపా నేత మేడం రమేష్, అన్ని మండలాల నేతలు, మహిళలు పాల్గొన్నారు.

వైకాపా నేత గుంజి శ్రీనివాసరావుపై కేసు

కనపర్రు (నాదెండ్ల), న్యూస్‌టుడే : మాజీ మంత్రి విడదల రజిని అనుచరుడు, కనపర్రు వైకాపా నేత గుంజి శ్రీనివాసరావుతో పాటు మరో ఆరుగురిపై నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఏడాది జనవరి 22న విజయవాడ నుంచి కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామానికి వచ్చిన తన కారును శ్రీనివాసరావు, గుంజి రవి తదితరులు అడ్డగించారని, చేపల చెరువు కౌలు వేలం పాట వ్యవహారంలో అడ్డు వస్తున్నావంటూ గొడవ పెట్టుకున్నారని బాధితుడు పూడోట బాలకోటేశ్వరరావు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. కారు ధ్వంసం చేయడంతో తప్పించుకుని ఇంటికి చేరుకున్న తనపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారన్నారు. అప్పుడే ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఇప్పుడైనా న్యాయం చేయాలని కోరారు. దీంతో పోలీసులు రవి, గోపికృష్ణ, ప్రసాదు, భాస్కర్ మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు బుధవారం తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



అదుపుతప్పిన బస్సు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : చీరాల ఆర్టీసీ డిపో బస్సు చిలకలూరిపేట వైపు నుంచి నరసరావుపేటకు వస్తున్న సమయంలో బాబాపేట వద్ద అదుపు తప్పి కాలువ పైకి వెళ్లింది. ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. బస్సులు నడిపేటప్పుడు అతివేగం తగ్గించుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఈ కాలనీల్లో నిత్యం కన్నీళ్లే

- ఇళ్ల ముందే మురుగు
- మట్టి రహదారులతో అవస్థలు

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట), న్యూస్‌టుడే : పట్టణంలోని పలు కాలనీల్లో ప్రజలు సరైన మౌలిక వసతులు లేక నానా అవస్థలు పడుతున్నారు. పన్నులు సకాలంలో చెల్లిస్తున్నా అభివృద్ధి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్లు ఉన్నచోట మురుగు కాలువ ఉండదు, కాలువ ఉన్న చోట రహదారులు సక్రమంగా ఉండవని ఆందోళన చెందుతున్నారు. శివారు కాలనీల్లో మట్టిదారులే ఉన్నాయి. కొద్దిపాటి వర్షానికే బురదమయంగా మారి నడవలేని పరిస్థితి ఉందని అక్కడివారు వాపోతున్నారు.



కోడెల శివప్రసాదరావు కాలనీలో బురదమయంగా అంతర్గత రహదారి

★ పట్టణంలోని రవీంద్రనగర్, బరంపేట, యానాదికాలనీ, కోడెల శివప్రసాదరావు కాలనీలో పలు వీధుల్లో మట్టి రోడ్లు ఉండగా వర్షం పడితే ఇవి బురదమయంగా మారి వాహనాలు నడపలేని పరిస్థితి. శివారు కాలనీలను కలిపే ప్రధాన రహదారులు మట్టి రోడ్లు కావడంతో ఇబ్బందిగా ఉంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పలు చోట్ల మురుగు వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. బరంపేట శివమందిరం రోడ్లో మురుగు కాలువ లేక మురుగు రోడ్డుపైకి వదిలేస్తున్నారు. దీంతో ఇళ్ల ముందే నిల్వఉండి దుర్వాసనతో పాటు దోమలు ప్రబలుతున్నాయి. కోడెల శివప్రసాదరావు కాలనీలో ప్రణాళిక లేకుండా మురుగు కాలువలు నిర్మించగా మురుగు పారే దారి లేక ఇళ్ల మధ్య నిలిచిపోతోంది. అంతేకాక పలు వార్డుల్లో మురుగునీటిని ఖాళీ స్థలాల్లోకి వదులుతున్నారు. దీంతో దుర్గంధం తట్టుకోలేక పోతున్నామని వాటి పక్కన ఇళ్లవారు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టి అంతర్గత రహదారులు, మురుగు వ్యవస్థ నిర్మించాలని కోరుతున్నారు.



మురుగు కాలువ నిర్మాణానికి తీసిన గుంతలో పేరుకున్న మురుగు

సరస్వతీ నమోస్తుతే

న్యూస్‌టుడే, బృందం : జిల్లాలో దసరా శరన్నవ రాత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో భక్తులు పెద్దఎత్తున ఆలయాలకు వచ్చి అమ్మవారి అలంకారాలు చూసి తరలిస్తున్నారు. పూజలు చేస్తున్నారు.



జగన్మాత పీఠంలో సరస్వతి దేవిగా అమ్మవారు.



నూజండ్ల లక్ష్మీదేవి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం



విఠంరాజుపల్లిలో సరస్వతీదేవిగా ..



శావల్యాపురం : గంటావారిపాలెంలో...



చిలకలూరిపేట : శారదాంబ దేవాలయంలో..



నరసరావుపేట : దాసరికాలనీ దేవాలయంలో ..



చిలకలూరిపేట మండలం పసుమర్రు శివాలయంలో ...



చిలకలూరిపేట : సంతోషి మాత ఆలయంలో..



రొంపిచర్ల : వడ్లమూడి వారిపాలెంలో ..



మహా సరస్వతీదేవిగా రొంపిచర్ల చౌడేశ్వరిదేవి



వినుకొండ : మూలవిరాట్‌కు పలకలు, బలపాలతో అలంకరణ



వినుకొండ : వాసవీ కల్యాణ మండపంలో..



నరసరావుపేట : పాతూరులో పార్వతి అమ్మవారు



రామిరెడ్డిపేటలో మహాసరస్వతి అలంకారంలో బాలచౌడేశ్వరి

లింగాకర్షక బుట్టలతో గులాబి పురుగు నివారణ



రైతులకు సూచనలిస్తున్న లాం ప్రధాన శాస్త్రవేత్త శ్రీరాజమణి, శాస్త్రవేత్తలు నరేష్‌కుమార్, మనోజ్

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు ఎకరాకు పది లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని లాం ప్రధాన శాస్త్రవేత్త జి. రాజమణి రైతులకు సూచించారు. చిలకలూరిపేట మండలం గంగన్నపాలెం, కోమటనేనివారిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పత్తిపంట పరిశీలించారు. అనంతరం లాం ప్రధాన శాస్త్రవేత్త రాజమణి, శాస్త్రవేత్తలు నరేష్‌కుమార్, మనోజ్ రైతులతో సమావేశం నిర్వహించి గులాబి రంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతలు వివరించారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం. శివకుమారి, మండల వ్యవసాయాధికారి టి. శ్రీలత, ఏఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యడ్లపాడు : పత్తిలో గులాబి రంగు పురుగుల ఉనికి గమనించటానికి లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మండలంలోని తిమ్మాపురం, దింతెనపాడులో నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ మాట్లాడి సూచనలు చేశారు. ఏరువాక శాస్త్రవేత్త వెంకటరాములు, జిల్లా వనరులు కేంద్రం సమన్వయకర్త శివకుమారి, ఏవో సీహెచ్ సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

రొంపిచర్ల : వరిలో యాజమాన్య పద్ధతులు, చీడపీడలు, తెగుళ్ల నివారణకు వ్యవసాయశాఖ, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలని మండల వ్యవసాయాధికారిణి పి. శివ లలిత అన్నారు. రొంపిచర్ల, ఆరేపల్లి గ్రామాల్లో బుధవారం వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో వరి, మిరప పొలాలను పరిశీలించారు. పశు వైద్యులు శ్రీకాంత్, వీఏఏలు అనిల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట సెంట్రల్ : మండలంలోని ఇక్కుర్రు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో నరేంద్రబాబు వరి పంట పరిశీలించి ఆకుముడత పురుగు ఉందని, దాని నివారణకు తీసుకోవాల్సిన చర్యలు రైతులకు వివరించారు. పేరయ్య, శ్రీనివాసరావు, వ్యవసాయ సహాయకులు రవితేజ, రైతులు పాల్గొన్నారు.

నూజండ్ల : కందిలో వెర్రి తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి సుగుణా బేగం అన్నారు. పువ్వాడ, కొత్త కొత్తపాలెంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కంది, మినుము, వరి పంట పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. వ్యవసాయ సహాయకుడు కోటేశ్వరరావు, మార్కెట్ యార్డు సూపర్‌వైజర్ అమీర్ బాష, రైతులున్నారు.

గుండెపోటుతో ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి

నివాళులర్పించిన డీసీ, ఈఎస్, అసోసియేషన్ నాయకులు



చావల శ్రీనివాసరావు (పాతచిత్రం)

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎక్సైజ్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతిచెందిన ఘటన ఆ శాఖలోని అధికారులు, సిబ్బందిని కలచివేసింది. గుంటూరుకు చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ చావల శ్రీనివాసరావు (53) చిలకలూరిపేట పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి నుంచి స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అతనికి బుధవారం ఉదయం గుండెపోటు వచ్చింది. వెంటనే సిబ్బంది ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆ శాఖ ఉప కమిషనర్ శ్రీనివాసులు, ఈఎస్ అరుణకుమారి, కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మార్పు కోటయ్య, పీసీ విల్సన్ గుంటూరు కోబాల్డుపేటలోని నివాసంలో చావల శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బస్టాండ్‌లో వ్యక్తి మృతి

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది పడి ఉండగా పారిశుద్ధ్య కార్మికులు గుర్తించి ఆర్టీసీ అధికారులకు తెలిపారు. 2వ నంబర్ ప్లాట్‌ఫారం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడని గుర్తించి అధికారులకు తెలపగా వారు మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు బొల్లాపల్లి మండలం రేమిడిచర్లకు చెందిన ఏరుగాని ఏడుకొండలు (49)గా గుర్తించారు. మద్యానికి అలవాటు పడటంతో ఇతని భార్య విడిగా ఉంటోందని గ్రామస్థులు తెలిపారు.

ముందస్తు విజయదశమి వేడుకలు



కోలాటమాడుతున్న విద్యార్థినులు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలలో ముందస్తు విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా దశావతారాల వేషధారణల్లో విద్యార్థినులు మహిషాసురమర్ధిని నృత్య ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా కోలాటాలు, దాండియా నృత్యాలతో పరిసరాలు హోరెత్తించారు. ఏటా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని కళాశాల ఛైర్మన్ షేక్ మీరావలి తెలిపారు. కళాశాల కార్యదర్శి కరీమ్‌మొహిద్దీన్, డైరెక్టర్ మస్తాన్‌షరీఫ్, ప్రిన్సిపల్ డాక్టర్ నాగమల్లేశ్వరరావు పర్యవేక్షించారు.



సందడిగా పోటీలు

ఇస్రో, షార్‌ల ఆధ్వర్యంలో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో మూడ్రోజుల పాటు అంతరిక్ష వారోత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం, వ్యాసరచన తదితర అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

- నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే

అవీ ఇవీ

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి సత్తా చాటాలి: ఎమ్మెల్యే

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే : రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపించి సత్తా చాటాలని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు అన్నారు. ఎన్జీవోకాలనీలో బుధవారం ఓట్ల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సీనియర్ నేత అని, ఆయన్ను గెలిపించుకోవాలని చెప్పారు. ప్రతి కార్యకర్త వార్డుల్లో పట్టభద్రుల ఓట్లు నమోదు చేయాలని, క్లస్టర్ బాధ్యులు బాధ్యత తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఉప తహసీల్దారుగా ధనలక్ష్మి

నాదెండ్ల : నాదెండ్ల ఉప తహసీల్దారుగా ధనలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పిడుగురాళ్ల నుంచి ఆమె బదిలీపై ఇక్కడకి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన అనూరాధ యడ్లపాడుకు వెళ్లారు.

ప్రతిష్టాత్మకంగా భాజపా సభ్యత్వ నమోదు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : దేశవ్యాప్తంగా అన్ని మండలాల్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భాజపా ప్రాథమిక సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 34 మండలాల్లో 25 వేల సభ్యత్వాలకు పైగా చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర ఓబీసీ ఉపాధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. చిలకలూరిపేట పట్టణంలో 6 వేలకు పైగా ప్రాథమిక సభ్యత్వాలు పూర్తయ్యాయని, నియోజకవర్గంలో 8వేలకు పైగా చేసినట్లు తెలిపారు. అక్టోబరు 15 వరకు ఇది కొనసాగుతుందని వెల్లడించారు. సమావేశంలో పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు అడుసుమల్లి వెంకటేశ్వరరావు, పట్టణ ఓబీసీ అధ్యక్షుడు కుప్పం కల్యాణ దుర్గారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అన్నపరెడ్డి లక్ష్మణ్, గుమ్మ బాలకృష్ణ, జోలపురం వెంకటరాయుడు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి బ్యాట్ బహూకరణ

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే : ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అండర్- 19 బాలికల రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న పట్టణానికి చెందిన కుంచాల మధుశాలినికి బుధవారం ఆంధ్ర రాష్ట్రస్థాయి మాజీ క్రికెట్ క్రీడాకారుడు ఆర్. దుర్గాప్రసాద్ బ్యాట్ బహూకరించారు. పలువురు అతిథులు పాల్గొన్నారు

గ్రామాభివృద్ధికి పని చేయాలి

నూజండ్ల : ప్రజలు మనమీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి పంచాయతీ పాలకవర్గం పని చేయాలని సూపరింటెండెంట్ పార్థసారథి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ నిధులు సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే అభివృద్ధి సాధ్యమని, పంచాయతీ సమావేశంలో సమస్యలను సర్పంచి, పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లి.. వార్డు సభ్యులు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన చెప్పారు.

చెత్త కనిపిస్తే కఠిన చర్యలు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : పట్టణంలో ఎక్కడ చెత్త కనిపించినా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని టీ స్టాల్స్, హోటల్స్ వారు దుకాణాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వచ్చిన చెత్తను చెత్తబండ్లకు అందించాలని సూచించారు. రోడ్డు మార్జిన్లలో ఉన్న చెత్త చెదారాన్ని తొలగింపజేశారు. మున్సిపల్ నియమ, నిబంధనలు వ్యాపారులు పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆక్రమణలు అడ్డుకునేందుకు ప్రత్యేక కార్యదళం

వినుకొండ, న్యూస్‌టుడే : పట్టణంలో రహదారి ఆక్రమణలను అడ్డుకునేందుకు పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యదళం ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్ర బోస్ తెలిపారు. ఇందుకు ప్రత్యేక వాహనానికి సైరన్ అమర్చి రోజూ సాయంత్రం వీధుల వెంట తిప్పుతామని తెలిపారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు పట్టణ పౌర సదుపాయాల మెరుగుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మరమ్మతులకు గురైన వాహనాలను బుధవారం పరిశీలించి వీటి ఖర్చు తగ్గించుకునేందుకు సిబ్బందికి ప్రత్యేక సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. పట్టణంలోని 12వ వార్డు సచివాలయాలకు ఆరు వాహనాలను కేటాయించామని, నిర్వహణ బాధ్యత శానిటరీ కార్యదర్శులకు అప్పగించినట్లు చెప్పారు. పట్టణంలో పరిశుభ్రత, సుందరీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు.

పౌష్టికాహారం అందజేత

వినుకొండ రూరల్ : స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సలకు వచ్చేది పేదలేనని.. వారికి ప్రతి నెలా పౌష్టికాహారాన్ని అందించనున్నట్లు వెంకటేశ్వర సేవాదళ్ సభ్యులు తెలిపారు. బుధవారం గర్భిణులకు ప్రొటీన్ లడ్డూ, పాలు అందజేశారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన సేవాదళ్ సభ్యులు వైద్యశాలకు వచ్చి ప్రతినెలా ఆహారాన్ని అందిస్తారని పేర్కొన్నారు. వైద్యశాల్లో ఉన్న వారికి వైద్యశాల సూపరింటెండెంట్ అబ్దుల్ రజాక్ చేతుల మీదుగా ఆహారం అందించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన పోలేరమ్మ తల్లి విగ్రహం

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : మండలంలోని కమ్మవారిపాలెంలో బుధవారం పోలేరమ్మతల్లి, పోతురాజుల విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

రాజశ్యామల యాగం



రాజశ్యామల యాగం చేస్తున్న హిమాలయ గురూజీ, శ్రీనివాసానందస్వామి

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే : తొమ్మిది రోజుల పాటు రాజశ్యామల యాగం చేయడం మామూలు విషయం కాదని, అది హిమాలయ గురూజీకే సాధ్యమైందని రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద స్వామి మహారాజ్ అన్నారు. గురూజీని అభినందించారు. విఠంరాజుపల్లిలోని శాంతి ఆశ్రమం వద్ద దేవీ నవరాత్రుల ఉత్సవాలకు ఏడోరోజు బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాజశ్యామల యాగంలో పాల్గొని, కుంకుమపూజ, 108 శ్రీచక్ర కలశ పూజ, నవగ్రహ మండపారాధన, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రవచనాలు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

7వ రోజుకు కార్మికులు, ఉద్యోగుల ఆందోళన



ఆందోళన చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే : కారణం లేకుండా విధులను తొలగించారని, వెంటనే కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని పీడీఎం నాయకులు డిమాండ్ చేశారు. వారం రోజులుగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఒప్పంద కార్మికులు, ఉద్యోగుల ఆందోళనకు బుధవారం పీడీఎం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకుడు వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయ వేధింపులతో కార్మికులు, ఉద్యోగులను విధుల నుంచి తొలగించడం మంచి పద్ధతి కాదని, రెండు నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మద్దతు తెలిపిన వారిలో సీఐటీయూ గౌరవాధ్యక్షుడు సిలార్ మసూద్, నల్లపాటి రామారావు, జిలానీ మాలిక్ తదితరులున్నారు.

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

పౌష్టికాహారం పంపిణీ


గర్భిణులు, రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న వైద్యాధికారి విద్య

పెదకూరపాడు, న్యూస్‌టుడే: పెదకూరపాడు సీహెచ్‌సీ, 75త్యాళ్లూరు పీహెచ్‌సీ పరిధిలో వైద్యపరీక్షలకు వచ్చిన గర్భిణులు, రోగులకు హుస్సేన్‌నగరం గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు మాగులూరి భానుప్రకాష్ సమకూర్చిన పౌష్టికాహారాన్ని బుధవారం అందించారు. సీహెచ్‌సీ వైద్యాధికారి విద్య రోగులకు ఆహారం పంపిణీ చేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు కృష్ణారావు, కిరణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాసం

దుర్గి, న్యూస్‌టుడే: మూలా నక్షత్రం పురస్కరించుకుని మండలంలోని అన్నిగ్రామాల్లో దుర్గామాతను సరస్వతిదేవిగా అలంకరించారు. అర్చకులు సరస్వతి పూజ నిర్వహించి చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. శ్రీనిదానంపాటి అమ్మవారి సన్నిధిలో చిన్నారులకు పలకలు, రాతపుస్తకాలు, పెన్నులు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు దంపతుల చేతుల మీదుగా అందజేశారు. ఓబులేశునపల్లెలో మహిళలు కుంకుమ పూజలు చేశారు.


చిన్నారులకు పలకలు, పుస్తకాలు అందజేస్తున్న ఆలయ వంశపారంపర్య ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? పాత, కొత్త సుగాలికాలనీలు, మార్టిన్‌పేట, జాషువానగర్‌లలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. - **బాబు, పాస్టర్**

✔ కుక్కల సంతానోత్పత్తిని నిరోధించేందుకు చర్యలు చేపడుతున్నాం. కౌన్సిల్‌లోనూ నిర్ణయం తీసుకున్నాం.
- **షమ్మి, మున్సిపల్ కమిషనర్** – న్యూస్‌టుడే, సత్తెనపల్లి

? రెంటచింతల నాయుడుపేట కాలనీలోని ఓ వీధిలో పిచ్చిచెట్లు పెరిగాయి. అందులో విష సర్పాలు సంచరిస్తున్నాయి. పిచ్చిచెట్లు తొలగించి, సీసీ రహదారి ఏర్పాటు చేయాలి.
- **రాగిడి ప్రతాప్‌బాబు, రెంటచింతల**

✔ పిచ్చిచెట్లు తొలగించి, కాలనీవాసులకు రహదారి సౌకర్యం కల్పిస్తాం. - **కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి**
– న్యూస్‌టుడే, రెంటచింతల

? గ్రామంలో కోతుల బెడద అధికంగా ఉంది. ఒంటరిగా వెళ్లేవారిపై దాడి చేస్తున్నాయి. - **హోనిమిరెడ్డి, మిట్టమీదపల్లె**

✔ త్వరలో కోతులను పట్టించి, అడవిలో వదిలేస్తాం.
- **మాచర్లయ్య, పంచాయతీ కార్యదర్శి**
– న్యూస్‌టుడే, వెల్దుర్తి

మేజరు కాలువలకు మహర్దశ

నేటి నుంచి మరమ్మతులు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే

గురజాల నియోజకవర్గంలోని మేజరు, మైనరు కాలువలకు మహర్దశ పట్టనుంది. వైకాపా పాలనలో సాగునీటి కాలువల గురించి పట్టించుకోలేదు. తంగెడ, ఆకురాజుపల్లి మేజర్ల మరమ్మతులకు నిధులు వచ్చినా పైపై మెరుగులు దిద్ది బిల్లులు చేసుకున్నారు. మిగిలిన ప్రాంతాల్లో తట్ట పూడిక తీసింది లేదు. కాలువలకు మరమ్మతులు చేయకుండా గాలికి వదిలేశారు. ఫలితంగా చివరి భూములకు నీటి తడులు అందక పంట దిగుబడి తగ్గిపోయి రైతులు నష్టపోయారు. కాలువ కట్టలపై రాత్రులు జాగారం చేశారు. పిచ్చి చెట్లు, నాచు, పూడికతో పూడిపోయాయి. మరోవైపు డ్రాపుల వద్ద కట్టలకు కోతలు ఏర్పడ్డాయి. కట్టలపై కంప చెట్లు పెరిగిపోయాయి. రెండేళ్ల నుంచి కాలువలకు నీరు రాకపోవడంతో చాలామంది రైతులు పొలాలను బీళ్లుగా వదిలేశారు. ఈ ఏడాది నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండింది. ముందుగానే నీరు విడుదల చేశారు. కానీ, చివరి భూములకు నీరు అందే పరిస్థితి లేదు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మేజరు, మైనరు కాలువలకు మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈమేరకు పలుమార్లు నీటిపారుదలశాఖ అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. కాలువల బాగు కోసం రంగంలోకి దిగారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోయినా రైతుల ఇబ్బందులు తొలగించేందుకు మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు.


ఆనవాళ్లు లేని ఆకురాజుపల్లి మేజరు కాలువ


కాలువ నిండా పిచ్చిమొక్కలు

ఎమ్మెల్యే యరపతినేని నిర్ణయంతో హర్షం

నియోజకవర్గంలో తంగెడ, ఆకురాజుపల్లి, రామాపురం, దైద మేజర్లు ఉన్నాయి. వీటితోపాటు అనేక మైనరు కాలువలు ఉన్నాయి. గురువారం అన్ని మేజర్లలో మరమ్మతులు ప్రారంభించనున్నారు. సుమారు 20 జేసీబీలు ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నిర్ణయంతో నియోజకవర్గ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోనే మొదటగా సాగునీటి కాలువల బాగుకు ఎమ్మెల్యే చొరవ చూపారని, చివరి ఆయకట్టుకు నీరు అందుతుందని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల ఇబ్బందులు గుర్తించి ఎన్నికల సమయంలోనే హామీ ఇచ్చానని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాలువల మరమ్మతులకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు.

యువతకు ఉపాధి కల్పిస్తాం

పెదకూరపాడు, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ వైకాపా అసమర్థ పాలనతో ఐదేళ్లలో నిరుద్యోగం పెరిగిపోయిందని విమర్శించారు. తనకున్న పరిచయాలతో హైదరాబాద్, వైజాగ్‌లోని కొన్ని కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి, యువతకు ఉపాధి కల్పించాలని కోరినట్లు వివరించారు. 10వ తరగతి ఆపైన చదివిన నిరుద్యోగ యువత తమ విద్యార్హతతో కూడిన బయోడేటాను స్థానిక మండల తెదేపా కార్యాలయం లేదా గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో అందించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలతో మేలు

పెదకూరపాడు: ప్రకృతి విపత్తులను తట్టుకునేలా ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు నిలుస్తున్నాయని డీపీఎం అమలకుమారి అన్నారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలతో మునిగిన పత్తి పంట, ప్రకృతి విధానంలో సాగుచేసిన పత్తి పంటను రైతు సాధికార సంస్థ కమ్యూనికేషన్ థిమ్మాటిక్ విభాగం విద్యాసాగర్, శివాజీ, పట్నాయక్, నాగమణితో కలిసి పరిశీలించారు. రైతులు ప్రకృతి విధానంలో పంటలు సాగు చేయాలన్నారు.

కాలువలో పడిన వ్యక్తి మృతి

దుర్గి, న్యూస్‌టుడే: దుర్గి మండలం అడిగొప్పల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు మృతదేహం నకరికల్లు మండలంలోని గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో బుధవారం గుర్తించారు. వెంకటేశ్వర్లు గత రెండేళ్లుగా కుటుంబంతో వినుకొండలో ఉంటున్నారు. ఈ నెల 6న వినుకొండ నుంచి అడిగొప్పలలోని నిదానంపాటి అమ్మవారి గుడి వద్దకు వచ్చారు. ఈ క్రమంలో నాగార్జునసాగర్ కాలువలో దిగి ప్రమాదవశాత్తు గల్లంతు అయి ఉంటాడని ఆతడి సోదరుడు సుబ్బారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై జె. శ్రీనివాసరావు చెప్పారు. పట్టణానికి చెందిన పతంగి వెంకటేశ్వర్లు(65)ను ఈనెల 5న ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో తలకు బలమైన గాయం కావడంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు.

పెట్రోల్ బంకు పరిశీలన

కారంపూడి: కారంపూడిలోని వినుకొండ రోడ్డులో నూతనంగా నిర్మించే పెట్రోలు బంకును జేసీ సూరజ్ గనోరే పరిశీలించారు. తొలుత తహసీల్దారు కార్యాలయానికి చేరుకున్న జేసీ తహసీల్దారుతో కలిసి పెట్రోలు బంకుకు సంబంధించిన రికార్డులు పరిశీలించి, అనంతరం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

సరస్వతీ నమస్తుభ్యం..

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారు ఆలయాల్లో అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం అమ్మవారు శ్రీసరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలుచోట్ల చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. - **న్యూస్‌టుడే, బృందం**


మాచవరం: వాసవీ మాత


అచ్చంపేట సీతారామస్వామి ఆలయంలో..


బెల్లంకొండలో సరస్వతి దేవి


ఎమ్మాజీగూడెంలో..


గురజాల: కనకదుర్గ ఆలయంలో..


సత్తెనపల్లి మండలం పెదమక్కెనలో సరస్వతి దేవిగా..


పిడుగురాళ్ల: కనకదుర్గమ్మ గుడిలో..


మాచవరం: శివాలయంలో అమ్మవారు


క్రోసూరు: సరస్వతి దేవి అలంకారంలో అమ్మవారు


సత్తెనపల్లి: నీలంపాటి శ్రీలక్ష్మి అమ్మవారు


సత్తెనపల్లి శ్రీరామమందిరంలో


పిడుగురాళ్ల: గుత్తికొండ బిలంలో రాజరాజేశ్వరిదేవి


పిడుగురాళ్ల: బ్రహ్మంగారి గుడిలో..


సత్తెనపల్లి: వడ్డవల్లి బొడ్రాయి సెంటర్‌లో..


పెదకూరపాడు: నాగమల్లేశ్వరస్వామి ఆలయంలో..


సత్తెనపల్లి: సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో..

ఉపాధి పనులపై ప్రజావేదిక


ప్రజావేదికలో అధికారులు

అమరావతి, న్యూస్‌టుడే: 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనులపై చేపట్టిన సామాజిక తనిఖీపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. ఇన్‌ఛార్జి పీడీ బూసిరెడ్డి సమక్షంలో తనిఖీ నివేదికను అర్జీవాల ప్రజావేదిక ముందు ఉంచారు. క్షేత్ర స్థాయి పలుచోట్ల క్షేత్ర సహాయకులు రికార్డుల నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలిపారు. దీనిపై పీడీ మాట్లాడుతూ క్షేత్ర సహాయకులు తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. పలు గ్రామాల్లో నాటిన పండ్ల మొక్కలు వరద ముంపునకు గురై ఎండిపోయాయని, ఏ పొలాలలో అవి లేవని సామాజిక తనిఖీలో గుర్తించినట్లు తెలిపారు. ఎంపీడీఓ శివపార్వతి, ఏపీఓ సుధ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల రూపురేఖలు మారుస్తాం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల రూపురేఖలు మార్చేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తెలిపారు. రఘురామ్‌నగర్‌లోని ప్రజావేదికలో బుధవారం పంచాయతీరాజ్ శాఖపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 14 నుంచి పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు జీతాలు జమ

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: దసరా పండగ వేళ సమగ్ర శిక్ష ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం సంతోషాన్ని నింపింది. ఆగస్టు, సెప్టెంబరు నెల వేతనాన్ని ఉద్యోగుల బ్యాంకు ఖాతాలకు బుధవారం జమ చేసింది. సమగ్ర శిక్షలో పనిచేసే మండల విద్యా వనరుల కేంద్రాల ఉద్యోగులు, సీఆర్‌పీలు, పీటీఐలు, ఏఈఆర్‌టీలు, ఆయాలు, కేజీబీవీ ఉద్యోగినులందరికీ రెండు నెలల వేతనం ఒకేసారి అందింది.

ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు

అమరావతి, న్యూస్‌టుడే: కృష్ణానదిలో ఈతకు వెళ్లి యువకుడు గల్లంతయ్యాడు. మల్లాది గ్రామానికి చెందిన సాలోమాన్ రాజు(17) ఇంట్లో శుభకార్యం ఉండటంతో బంధువులు వచ్చారు. బుధవారం కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి కృష్ణానది వద్దకు వెళ్లారు. చరణ్ అనే యువకుడు నదిలో దిగాడు. ప్రమాదవశాత్తు సాలోమాన్ నీట మునిగి గల్లంతయ్యాడు. సీఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరి యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

మోర్జంపాడులో పోలీసుల మోహరింపు

మాచవరం: బెల్లంకొండ మండలం ఎమ్మాజీగూడెం రెవెన్యూ గ్రామ పరిధిలో ఏర్పాటవుతున్న ఐదవాల్ పరిశ్రమను అడ్డుకునేందుకు మోర్జంపాడు వాసులు చేసిన ప్రయత్నాలు ఫలించ లేదు. గ్రామస్థులు కొందరు బుధవారం గ్రామంలో ప్రదర్శన నిర్వహించి, పరిశ్రమ వద్ద ధర్నా చేయాలని నిర్ణయించారు. అయితే మంగళవారం రాత్రి దాచేపల్లి సీఐ వెంకట్రావు, ఎస్సై సతీష్, సిబ్బంది పదిమందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా ఆందోళన నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాంతో గ్రామస్థులు ఆందోళన విరమించుకున్నారు.

నాణ్యమైన విద్యుత్తు ఇవ్వండి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు ఇవ్వాలని ఎస్ఈ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని విద్యుత్తు సబ్‌స్టేషన్ కార్యాలయంలో పిడుగురాళ్ల సబ్ డివిజన్ పరిధిలోని ఇంజినీర్లకు సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంతరాయం లేకుండా సరఫరా అందించాలని చెప్పారు. పదేపదే అంతరాయం కల్గే ప్రాంతాలపై దృష్టి పెట్టి సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం 220 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. మాచర్ల డివిజన్ ఇన్‌ఛార్జి డీఈ రాంబొట్ల తదితరులు పాల్గొన్నారు.


వివరాలు నమోదు చేస్తున్న ఎస్ఈ విజయ్‌కుమార్

సీతారామాలయంలో పూజలు

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: విజయపురిసౌత్‌లోని శ్రీసీతారామాలయం రాజగోపుర శిఖర కలశ ప్రతిష్ఠ బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణాన్ని బ్రహ్మారెడ్డి దంపతులు వీక్షించారు. అనంతరం సి-టైపు క్వార్టర్‌లోని కనకదుర్గ ఆలయంలో ఎమ్మెల్యే విద్యార్థులకు పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. నాయకులు జూలకంటి అక్కిరెడ్డి, పంగులూరి పుల్లయ్య, ఆలయ అధ్యక్షుడు కోలా వసంతకుమార్ రెడ్డి, ఈఈ వై. శ్రీహరి, జేఈ ఎస్‌కే ఏఈ బాబుమియా తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

రుణం పంచుకునే విషయంలో వివాదం

పొదపాడు(పెదకూరపాడు), న్యూస్‌టుడే: పొదుపు సంఘ సభ్యులు బ్యాంకు రుణం పంచుకునే విషయంలో ఏర్పడిన వివాదం ఘర్షణకు దారితీసిన ఘటన పొదపాడు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై గిరిబాబు వివరాల మేరకు.. పొదుపు సంఘానికి రూ. 10 లక్షలు రుణం మంజూరైంది. లబ్ధిదారుల ఖాతాలో జమ కావటంతో మంగళవారం సమావేశమయ్యారు. సభ్యురాలు పిల్లి శౌరీ సక్రమంగా నెల కిస్తీ చెల్లించడం లేదని, ప్రతి నెలా వడ్డీతో చెల్లించాల్సి వస్తుందంటూ గ్రూపు లీడర్, మిగతా సభ్యులు ప్రశ్నించారు. ప్రస్తుతం తనకు రుణం వద్దంటూ శౌరీ స్పష్టం చేసింది. అయితే ఆమె కుమారుడు అశోక్ అక్కడకు చేరుకుని నగదు తనకివ్వాలని కోరాడు. సభ్యురాలికి మాత్రమే ఇస్తామని చెప్పడంతో మాటామాటా పెరిగి మరో సభ్యురాలు కంతేటి శౌరీలును అశోక్ దుర్భాషలాడుతూ కర్రపై దాడి చేశాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు అశోక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాయితీతో బిందుసేద్యం పరికరాలు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: ఉద్యానపంటలు సాగుచేసే రైతులకు బిందు, తుంపర సేద్యం పరికరాలు రాయితీపై అందజేస్తారని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి చెప్పారు. బుధవారం జానపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతు సేవా కేంద్రంలో గ్రామసభను నిర్వహించారు.

పసుపు రంగు అట్టలతో తెల్లదోమ నివారణ

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: పత్తిలో తెల్లదోమల నివారణకు పసుపు రంగు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అరుణ రైతులకు సూచించారు. మాదల, ఇరుకుపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గులాబీ రంగు పురుగు, ఆకు చుట్టు పురుగు, సుడిదోమ నివారణ చర్యలను వివరించారు. పశువైద్యాధికారి పుల్లారెడ్డి పాల్గొన్నారు.